# మా ఆవిడ రొఖ్ఖ బేరం!

డాక్టర్ 'గిరి'

'చీరలమ్మా చీరలు... బెంగుళూరు చీరలు, బనారసు చీరలు, కోయంబత్తూరు చీరలు, జరీ చీరలు, సిల్కు చీరలు, జాకెట్టుగుడ్డలు - పరికిణీ గుడ్డలు...' యింకా యేవో వాడి తలకాయగుడ్డలు అని ఏకరువు పెడుతూన్న కేకవినబడిందో లేదో - వంటయింట్లో యేదో పని చేసికొంటూన్న మా గృహలక్ష్మి 'కాంతం' - అంటే నా భార్య అన్నమాట లెండి - తన పుట్టెంతా మునిగిపోయినట్లు, అంట్లచేత్తో అలాగే పరుగెత్తుకొంటూ, ఒక్క దూకుడున వీథిగుమ్మంలోకి దూకి 'ఓయ్ చీరలబ్బి - ఇదిగో ఓ చీరలాయనా! యిలాగా' అని మా ఇంటిని దాటి పోతూన్న చీరలవర్తకుడిని పిలచింది. తనవల్లనే యీ స్త్రీలోకమంతా దిగంబరులు కాకుండా యిలా నిలబడి ఉంది అనే మనోగర్వం వ్యక్తపరుస్తున్నట్లు, తన చేతిలోని గజంబద్దను యిలా - అలా త్రిప్పుకొంటూ, తనవెంట చీరల మూటను మోసికొని వస్తూన్న కూలి వాడితో కూడా మాయింట్లో ప్రవేశించాడు చీరల వర్తకుడు.

సాధారణంగా మా ఆవిడ చీరల వర్తకుని పిల్చిందంటే - వాడిని ఎప్పుడూ 'ఉత్త' చేతుల్తో పంపే అలవాటు లేదు. ఆవేళ నాచేతిలో ఎర్రని ఏగాని అయినా లేదు. ఈ పరిస్థితి తల్చుకొనేసరికి నాగుండెల్లో ఊయిపడింది. 'ఏమిదారి భగవంతుడా' అనే విచారం పట్టుకొంది నాకు. ఈ విచారమునకు పర్యవసానంగా ఆ చీరల వర్తకుని మీద పట్టరానంత ఆగ్రహం కలిగింది. 'ఈ వెధవలకు వేరేమీ పనీ - పాటూ లేదు కామోసు. రోజూ - ప్రొద్దస్తమానం వీళ్ళకిదే గోల. 'ఖర్మం' చాలక చీరలమాట మరచిపోయిన ఉత్తమ యిల్లాండ్రను కూడా రేపెడుతూ, ఆచీరలు ఈ చీరలు అని వర్ణించి - వాళ్ళను ఊరిస్తూ, యీకష్టకాలంలో తిండికే సంపాదించలేక కష్టపడుతూన్న వాళ్ళ భర్తలకీ వాళ్ళకీ మధ్య మనస్తాపాలను కలిగిస్తూ, సంసార సుఖానికి అంతరాయం ఆపాదించగల యీ చీరల వర్తకులు వీథివీధి - సందు సందు విడిచి పెట్టకుండా తిరుగుతూ ఉంటారే! వీళ్ళనేం చెయ్యాలి? నేనే యీ దేశానికే అధ్యక్షుణ్ణో, ప్రధానమంత్రినో, గవర్నరునో - కనీసం ఎంతలేదన్నా ఒక పోలీసు సబిన స్పెక్టరునో అయి ఉండి ఉంటే - ఇటువంటి వర్తకులను బహిష్కరించో, 'న్యూసెన్స్' ఛార్జి పెట్టో అణగత్రొక్కేవాణ్ణికదా' అని నాలో నేను, స్వగతంగా అనుకొన్నాను. అనుకోడమేమిటి - నిశ్చయించుకొన్నాను. ఇంకానయం, నగలవర్తకులుకూడా బయలుదేరి బంగారుచైన్లు, బంగారుగాజులు, వజ్రాలకమ్మలు, రవ్వల ఉంగరాలు ... అని వీధుల్లో అరవడానికి ఆరంభించారంటే! - 'గ్రుడ్డిలో మెల్ల' అన్నట్లు వాళ్లు రాకపోవడం కొంతనయం అని అనిపించింది.

అప్పటికప్పుడే చీరలవర్తకుడు తన మూటనువిప్పేసి, జాకెట్టువగైరా గుడ్డల్ని ఒకవైపు, పట్టుచీరల్ని మరోవైపు, జరీవాటిని యింకోవైపు పేర్చిపెట్టి మా ఆవిడతో వాటివాటి ఔన్నత్యాన్నిగురించి వర్ణిస్తున్నాడు. 'ఇది సుమంగలి చీర, యిది మళ్లీపెళ్లి చీర, యిది సంసారం చీర, యిది జీవితం చీర...' అని అంటూ ఒక్కొక్క చీరకు ఒక్కొక్క పేరు చెబుతున్నాడు. చీరలేమో బాగానే ఉన్నాయి - గాని చాయ నిలుస్తుందో లేదో అనే అనుమానం నాకు కలిగింది. అదేసమయానికి మా ఆవిడకుకూడా ఆ అనుమానం కలిగి, అవును గాని - మరి చాయ 'గారంటీ' యేనా అని అడిగింది వర్తకుణ్ణి.

'అదేమిటమ్మా అలా అడుగుతారు? చీరపోయినా చాయపోదనుకోండి. ఈ వీధిలోనే డజను చీరలు ఎగిరిపోయాయి. అందరూ అయిస్క్రిమ్ బార్డర్నే ఎంచుకొన్నారు. మీ అదృష్టంకొద్దీ ఆ రకంలో యీఒక్క చీరే మిగిలింది' అన్నాడు వర్తకుడు.

'ఇదేమి చీరోయ్?' అన్నాను నేను మరో చీరను చూపిస్తూ.

‘ఇదాండి! దీన్ని సంఘం చీరంటారు.’ అన్నాడు వర్తకుడు.

‘అలా అయితే మరి నీ దగ్గిర అగ్గిరాముడు చీరలు కూడా ఉన్నాయన్నమాట’ అన్నాను నేను.

‘ఇంకా ఆ సరుకు రాలేదండి’ అన్నాడు వర్తకుడు చలాకీగానే.

మా ఆవిడకు వాటిలో అయిస్క్రీమ్ బార్డరు చీర నచ్చింది, గాని ఎంగిలిచేత్తో దాన్ని ఎలా ముట్టుకోడంగనక! అందువల్ల చీరలవర్తకుణ్ణి అక్కడే ఉండమనిచెప్పి చెయ్యి కడుగుకోనుటకని లోపలికి వెళ్లింది. నేనుకూడా ఆమె వెనువెంట లోపలికి వెళ్లాను. ఇద్దరం ‘హాలు’లోనికి ప్రవేశించిన తర్వాత నేను మా ఆవిడతో “సరేగాని, కాంతం! ఆచీరను తీసికోబోతున్నావా?” అన్నాను.

“అదేమిటలా అడుగుతున్నారు? బేరం పడిందంటే తీసికొంటాను” అంది.

“బేరం పడుతుందనే అనుకో - అయినా - మరి”

“అంటే !”

“అంటే డబ్బులేదుకదా - ఎలాగా అని చూస్తున్నాను”

“చాల్లెండి! మీ కెప్పుడూ యింతే! మీ నోటితో మీరు యెప్పుడైనా ‘ఈ చీరకొనుక్కో డబ్బిస్తాను’ అని అన్నారు గనకనా” అని నిష్ఠూరంగా అంది.

“అవే ఉందునో మానే ఉందునో! ఏమనడానికైనా నాకో అవకాశం యిచ్చిఉంటేకదా ఆమాట. చీరలకేక వినీవినబడక ముందే నువ్వు తయారవుతావు. మొన్న ఎవడో ‘బీరకాయలు, బీరకాయలు’ అని అమ్ముతూఉంటే చీరలకలవరంలో ఉన్న నీ చెవులకు ఆ మాటలు ‘చీరకావాలా - చీ ర కా వా లా’ అన్నట్టుగా వినబడ్డాయికదా? బజారుకు నాతోవచ్చావంటే ఒక బట్టలదుకాణమన్నా ‘తనిఖీ’ చెయ్యకుండా విడిచిపెట్టవాయె. ఇంట్లో పెట్టెలనిండా చీరలు మడతలుమడతలుగా పడిఉన్నాయికదా? అటువంటప్పుడు చీరకొనుక్కోమని నన్నెప్పుడు - ఎలాగ అనమన్నావో చెప్పు.” అన్నాను.

“ఇంట్లో చీరలున్నాయికదా అని క్రొత్తఫాషన్ చీరలువస్తే కొనవద్దంటారా ?” అంది మాగృహిణి.

“నేనేమీ అనదల్చుకోలేదు. నాకెందుకాగోల. ఇవాళ మాత్రం డబ్బులేదు. నాకుతెలిసింది అంతే.” అన్నాను.

“అయితే మరెలాగ? ... ఒకవేళ వాడు అరువు యిస్తే తీసికోమంటారా ?” అంది మా యిల్లాలు. తాతాచార్యుల ముద్రలాగ యిది ఎలాగా తప్పేటట్లు లేదు. అందువల్ల “ఆ చీరలవాడు అప్పుగా యివ్వనంటే ఏంచేస్తావు ? ” అన్నాను.

“ఎందుకివ్వడేమిటి - అంత నమ్మక పోతాడా - రేపో ఎల్లుండో రమ్మంటాను. అంతలో యిల్లూవాకిలీ వదిలేసి పోతాననుకొంటాడా ?” అంది.

“అయితే నీయిష్టం.” అనేశాను. మా ఆవిడ పెరట్లోకి వెళ్లి కొంతసేపైంది. అంతలో చీరలవర్తకుడు “అమ్మగారూ! ఉండమన్నారా ? పొమ్మన్నారా ? ఒకయింట్లోనే యింతసేపైతే మావ్యాపారమెలాసాగుతుంది చెప్పండి” అన్నాడు. వర్తకుడు తొందరపడుతున్న విషయం మా ఆవిడతో చెప్పాలని నేను వంటగదివైపు వెళ్లి - ఓరవాకిలిగా వేయబడిఉన్న తలుపుసందులోంచి చూచేసరికి, మా ఆవిడ అలమారుదగ్గరనిలబడి, లోహపు సోపుపెట్టెలోనించి ‘నోట్లు’తీసి లెక్కపెట్టుకోవడం కనిపించింది. అయిదు రూపాయలనోట్లు, పదిరూపాయల నోట్లు నాకంటబడ్డాయి. అందుకేమా గృహలక్ష్మి అంత ధైర్యంగా చీరలవాడు అప్పుయిస్తాడని చెప్పగలిగిందని నేను గ్రహించాను. వెంటనే చడీ — చప్పుడూ లేకుండా మళ్లీ హాలులోకి వచ్చి ఏమీ ఎరుగనట్లు కుర్చీలో కూర్చున్నాను. దీనికనీ దానికనీ అప్పుడప్పుడు నా వద్దనుండి అడిగిపుచ్చుకొన్న డబ్బును అలా దాచిపెట్టుకొంటున్నదని నా కాలోజువరకు తెలియదు. ‘సరి! ఇప్పుడు మనం యిక్కడ ఉంటే మా ఆవిడ రొఖ్ఖ బేరానికి అడ్డంగా ఉంటుం’దని ఊహించుకొని - ఏదో మిషపెట్టి ఇల్లు విడిచాను. నేను తిరిగివచ్చేసరికి కాంతం ‘అయిస్క్రీమ్’ చీరను ధరించి నాకు స్వాగతమిస్తూ ‘చీరలవాడు పాపం — చాలా మంచివాడుసుమండీ — నామాట యిట్టే నమ్మేసి యీచీర ముప్ఫై రూపాయలకి అప్పుగా యిచ్చివెళ్లేడు’ అంది. “అవును- అందుకనే నేను లేనిపోని పని కల్పించుకొని వెళ్లిపోయాను. నేనంటే యిలాంటి అప్పుచేయడం నీకు చాలా శ్రమగా ఉంటుందని నాకు మొదటే తెలుసు” అన్నాను.